పుస్తక సమీక్ష :

ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర (రెండవభాగం)

మొదటిభాగాన్ని సమీక్షిస్తూ, ఇది వాస్తవానికి ఆంధ్రప్రాంతం చరిత్రకాదనీ, మన దేశంలో అన్నిప్రాంతాలచరిత్రకూ సామాన్యమయిన పరిణామక్రమానికి ఆంధ్ర ప్రాంతాన్ని ఒక ఉదాహరణగాతీసుకుని ఇచ్చిన వివరణఅనీ అన్నాము. మార్క్సిస్టు దృక్పథంనుండిచూస్తే ఈ రెండవభాగం అసలు చరిత్రేకాదు. మార్క్సిస్టు చరిత్ర కారుడు చరిత్రచెప్పకూడదు, వ్యాఖ్యానించాలి. ఏంజరిగిందోకాదు, ఎందుకుజరిగిందో చెప్పాలి. చెప్పేది రాజులచరిత్రకావచ్చు, భట్రాజులచరిత్రకావచ్చు, ఆర్థికరంగాన్ని (ముఖ్యంగా దోపిడీసంబంధాల్ని) ప్రాతిపదికగా వివరించాలి. అంతేగాని సీదాసాదా బూర్జువాచరిత్రరాసి విరివిగా 'ఫ్యూడల్' అన్న మాటను ప్రయోగించినంతమాత్రాన అది మార్క్సిజం అనిపించుకోదు. అట్టవెనకాల ప్రకాశకులు, తొలిపలుకులో రచయిత, చెప్పుకోకపోతే ఆయన 'ఒకస్పష్టమయిన, నిర్దిష్టమయిన' సిద్ధాంతాన్ని ఆధారం చేసుకొని పుస్తకంరాసారని ఏపాఠకుడికీ అనిపించదు. భూమిలో వ్యక్తిస్వత్వంఉందా లేదా అన్నపట్టింపుఒకటే. మొదటిభాగంనుండి రెండవభాగానికి వచ్చాక రచయిత మిగుల్చుకున్న మార్క్సిజం, అడపదడపా వ్యక్తపరచిన రాచరికవ్యతిరేకతగూడా బూర్జువాలక్షణమేగాని ప్రత్యేకించి మార్క్సిస్టుగుణంకాదు.

వ్యవసాయాన్ని రాజులు అభివృద్ధిచేస్తారు: మతసామరస్యాన్ని రాజులూ సుల్తానులూ సాధిస్తారు: విజయనగర రాజులు పోర్చుగీసు వర్తకులతో సత్సంబంధాలు నెలకొల్పడం 'వచ్చెపు దొంగల్ని తమతో సమానుల్నిగా గౌరవించడం', పంటలో పదింటతొమ్మిది వంతులవరకు పన్నుగా దోచుకున్న విజయనగర పాలకవర్గం కన్న పోర్చుగీసు వర్తకులు పెద్ద దొంగలా? విజయనగర రాజులతో కలహించిన కొండవీటి వేమారెడ్డిని గురించి రచయిత వ్యాఖ్య: 'బహమనీ సుల్తానులనుండి దేశాన్ని స్వతంత్రం చేయడానికై ఇతరులను కలుపుకోవాలనిగాని, విజయనగర హిందూ రాజులతో చెలిమిచేసుకోవాలనిగాని, వేమారెడ్డి ఎప్పుడూ ఆలోచించలేదు'. తెలుగువాళ్ళు (లేకపోతే హిందువులు) పరిపాలిస్తే దేశం స్వతంత్రమూ సుల్తానులు పరిపాలిస్తే అస్వతంత్రమూ అనుకోవడం శాస్త్రీయమా? 1950 లలో 'విశాలాంధ్ర' వేడిలో ఏటుకూరి బలరామమూర్తి గారు తాత్కాలికంగా మార్క్సిజాన్ని పక్కనుపెట్టి తెలుగు జాతిభక్తిని సిద్ధాంతంగా ఆంధ్రుల చరిత్ర రాసిన మాట వాస్తవమే. కాని ఆవేడి చల్లారి బూడిద అయిన 30 సంవత్సరాల తర్వాత గూడ కాకతీయులను, విజయనగర రాజులను, కొండవీటిరెడ్లను, 'తెలుగుజాతి' నాయకులుగా పరిగణించి ఆ నాయకత్వం

వారు సమర్థవంతంగా నిర్వహించనందుకూ, వాళ్లకు కలలో గూడతోచని ఆశయాల్ని వాళ్లు సాధించనందుకూ, వాళ్లను దుయ్యపట్టడం న్యాయమా?

'చరిత్ర అంటే రాజుల చరిత్రకాదు' అని మొట్టమొదట అన్నది మార్క్సిస్టులు కాదు బూర్జువాలే. అవి, వాళ్ళు చేసిందేమిటంటే చరిత్ర నుండి వ్యాఖ్యానాన్ని బహిష్కరించి రాజవంశాల చరిత్రస్థానాన, కొంచెం రాజవంశాల చరిత్ర, కొంచెం ఆర్థికరంగం చరిత్ర, కొంచెం పాలనావ్యవస్థ గురించి, కొంచెం సాహిత్యాన్ని గురించి కళలను గురించీ, చెప్పడం. సమాజంలో హెచ్చుతగ్గులూ పాలకపాలితులూ అన్న తేడాలను చూడకుండ 'సృష్టిలో మానవులంతా సమానులే' (all men are created equal) అని ప్రకటించడమే ప్రజాస్వామ్యం అనుకున్నట్టు, సమాజంలో అన్నిరంగాలనూ సమాంతరంగా నిలబెట్టి అన్నిటి చరిత్రనూ సమాంతరంగా, పరస్పర సంబంధాలు లేకుండ, చెప్పడమే శాస్త్రీయత (objectivity) అనుకుంటుంది బూర్జువా దృక్పథం. ఆ పద్ధతినే తుచతప్పకుండ పాటించారు కంభంపాటి సత్యనారాయణగారు. కావాలంటే చివరి అయిదు ప్రకరణాల శీర్షికలు చూడండి; కుతుబ్‌షాహి రాజవంశం, కుతుబ్‌షాహిల పాలనావ్యవస్థ, కుతుబ్‌షాహిల ఆర్థిక నిర్మాణం, కుతుబ్‌షాహీ యుగమతము- సమాజస్థితి, కుతుబ్‌షాహి యుగ సాహిత్యం - కళలు. వీటిలో ఏది ప్రధానం, ఏది అప్రధానం? ఏది నిర్ణాయకం, ఏది నిర్ణయించబడేది? పైగా ఈ వరసలోనే ఎందుకు చెప్పాలి? రాజవంశం తన పాలనావ్యవస్థనూ ఆర్థికనిర్మాణాన్నీ ఎంచుకుంటుందనీ, అటుతర్వాత మతము, సమాజస్థితి, సాహిత్యం, కళలు, రూపం తీసుకుంటాయనీ, దీని అర్థంకాదా? ఉత్పత్తిశక్తులేవీ, ఉత్పత్తిసంబంధాలేవీ, వైరుధ్యాలేవీ, వర్గపోరాటమేదీ, 'స్పష్టమయిన, నిర్దిష్టమయిన' సిద్ధాంతమేదీ?

వ్యాఖ్యానించుకోలేకున్నా కనీసం ఉత్పత్తిరంగం చరిత్రచెప్పుకుందాం. భారత దేశ ఫ్యూడలిజంలో కనీసం మూడుదశలున్నాయి. మొదటిదశ క్రీ.శ. తొలిశతాబ్దాలలో మొదలయినట్టుంది (అంతకుపూర్వం ఎటువంటివ్యవస్థ ఉండేదో చెప్పడంకష్టం. 'బానిసవ్యవస్థ' ఉండేదని తీర్మానించాలంటే చరిత్రను అమర్యాదగా బలాత్కరించాల్సి ఉంటుంది). ఈదశలో గ్రామీణప్రాంతాలలో వర్గవిభజన అంతగాలేదు. వర్ణ వ్యవస్థ బలపడిందిగాని కులవ్యవస్థ ఇంకా ఏర్పడలేదు (కనీసం ముదరలేదు). భూమి సాధారణంగా గ్రామసభల ఆధీనంలోవుండి రైతులకు దున్నుకునేందుకు పంచబడేది. గ్రామీణ స్వయంసంపూర్ణత అప్పుడప్పుడే ఏర్పడుతోంది. రైతులనుండి అదనపు ఉత్పత్తిని శిస్తురూపంలో సామంతులు, చిల్లరరాజులు, చక్రవర్తులు, ఒకసోపానంగా

(hierarchy) ఏర్పడి దోచుకునేవారు. కోశాంబి దీనిని (Feudalism from above అన్నాడు. ఈదశలోనే మనుధర్మశాస్త్రము, భగవద్గీత రాయబడ్డాయి. రెండూగూడా అంకుర రూపంలోని భూస్వామ్యసమాజపు సిద్ధాంతగ్రంథాలే.

అయితే క్రమంగా రాజులు, సామంతులు, భూదానాలుచేయడం మొదలు పెట్టారు. దానితో గ్రామీణప్రాంతాలలో ఒక భూస్వామ్య వర్గం ఏర్పడింది. ఈ భూదానాల గురించివిస్తృతమయిన సమాచారం సేకరించిన పరిశోధకుడు ఆర్. ఎస్. శర్మ మొదట్లో ఇవన్నీగూడ బ్రాహ్మణులకూ గుళ్ళకూఇచ్చిన అగ్రహారాలరూపంలో వుండేవనీ, తరువాతికాలంలో అధికార్లకు రొక్కపుజీతంబదులు జాగీర్లివ్వడంగూడ మొదలయిందనీ అంటాడు. సత్యనారాయణగారి పుస్తకం మొదటిభాగం చదివితేగూడ ఇదే అభిప్రాయం ఏర్పడుతుంది. అయితే శర్మఅన్నట్టు అగ్రహారదానాలు పుణ్యకార్యాల కింద జమకట్టబడటంవల్ల వాటిని లోహపుశాసనాలలో ప్రకటించగా, అధికార్లకిచ్చిన జాగీర్లను ఎక్కువకాలం నిలవుండని పత్రాలలోప్రకటించి ఉండవచ్చును. ఆ కారణంగా మనకులభ్యమయ్యే సమాచారమంతా అగ్రహారదానాల గురించేకావచ్చు. అదెట్లాగున్నా, 7-8 శతాబ్దాలనాటికి గ్రామీణ ప్రాంతాలలోనే ఒక దోపిడీవర్గం ఏర్పడి గ్రామీణభూస్వామ్యం (Feudalism from below) ఆవిర్భవించింది ఇది రెండవ దశ. ఈ అగ్రహారీకులకూ జాగీర్దార్లకూ సాధారణంగా తమకు ఈనాంగా ఇవ్వబడ్డ భూమినుండి పన్నువసూలుచేసుకొని అనుభవించే హక్కుమాత్రమే ఉంటుంది. ఒక్కొకసారి వెట్టిచేయించుకునేహక్కుగూడ ఇవ్వబడుతుంది. అయితే వాళ్ళు దానితో తృప్తిచెందక తమ ఈనాంలో కొంతభూమిని స్వంతంచేసుకోవడం, దాన్నిదున్నుతున్న రైతులను తమకింద కౌలుదార్లుగా మార్చుకోవడం, చాలాతర్చుగా జరిగేవి. కాబట్టే ఆర్. ఎస్. శర్మచూపించినట్టు, ఈ దశలోనూ తరువాతిదశలోనూ రాయబడ్డ ధర్మశాస్త్రాలలో (నారద, గౌతమ, ఇత్యాది) మనుధర్మశాస్త్రంలోలేని భూమితగాదాల ప్రస్తావనవుంది.

ఈ దశలోగూడ, అగ్రహారాలకింద, జాగీర్లకింద, ఉన్నభూమిని మినహాయిస్తే మిగిలిన భూమి ఇంకా గ్రామసభల అధీనంలోనే వుండేది. పన్నువసూలుదార్లు రెడ్డి, సుంకరి, గౌడ, సుంకాధికారి - గ్రామసభల ఉద్యోగులేతప్ప ప్రభుత్వాధికార్లు కారు. పన్నుగుత్తదార్లు (జమీందార్లు) అంతకంటే కాదు. కాని వాళ్ళజీతంగూడ ఈనాంలరూపంలోను, కానుకల (నజరానాల) రూపంలోను, ఉండడంచేత వాళ్ళకూ కొంత భూస్వామ్యస్వభావం ఉండేది. ఈ కాలంలోనే దేశంలో చాలా ప్రాంతాలలో

ప్రాంతీయ భాషలలో సాహిత్యం రావడం మొదలయింది. చిల్లర భూస్వాములూ అగ్రహారీకులూ జాగీర్దార్లూ పుట్టుకొచ్చి పాలకవర్గానికి కొంత విస్తృతి ఏర్పడడంతో ప్రాంతీయభాషల ప్రాధాన్యత పెరగడం సహజం, అయితే ఈ వర్గానికి ఏరకమయిన అభ్యుదయ స్వభావమూ లేకపోవడంతో ఆ సాహిత్యం అనువాద సాహిత్యం మాత్రమే కాగలిగింది. ఈ దశ కాకతీయుల తరువాతి కాలంవరకు నడిచినట్లుంది. ఈ కాలంలో పట్టణప్రాంతాలలో వ్యాపారమూ వృత్తిపరిశ్రమలూ లేకపోలేదుగాని, అవి అంతగా విస్తరించలేదు. స్వయంపోషక గ్రామాలకు ఉత్పత్తి విధానం స్టేటస్ ఇచ్చి దానికి 'ప్రాచ్య ఉత్పత్తి విధానం' (Asiatic Mode of production) అన్న పేరు తగిలించిన సత్యనారాయణగారు ఈ వ్యాపారస్తంభనకు స్వయంపోషక గ్రామీణవ్యవస్థను కారణంగా చూపారు. 'స్వయం సంపూర్ణ గ్రామవ్యవస్థే తలసరిసరుకుల ఉత్పత్తిని పెరగకుండ అణచిపుంచింది' (పేజీ 91) ఇది కోశాంబి నుండి అజ్ఞాతంగా అరువు తెచ్చుకున్న సూత్రీకరణ. Per-capita commodity production పెరగకుండడం భారతదేశ ఫ్యూడలిజానికీ యూరోపియన్ ఫ్యూడలిజానికీవున్న ముఖ్యమయిన తేడా అని కోశాంబి అన్నాడు. అయితే సామాన్యంగా కఠోరమయిన శాస్త్రీయప్రమాణాల్ని అనుసరించే కోశాంబి ఏ వివరణా ఏ నిరూపణా లేకుండచేసిన ఏకైక సూత్రీకరణ ఇది (నాకుతెలిసి) సత్యనారాయణగారుగూడ అటువంటి ప్రయత్నమేదీ అవసరం లేదనుకున్నట్లుంది.

అటుపైన (అంటే బహమనీ- విజయనగర- కళింగ గజపతులకాలంలో) మూడవదశ మొదలయింది. ఈదశలో వచ్చిన మొదటిమార్పు, పైనవివరించిన భూస్వామ్య సమాజపు క్రమపరిణామంలో భాగమే. గ్రామసభల అధికారం క్రమంగా క్షీణించి భూమిపై వ్యక్తియాజమాన్యం, స్వంతఆస్తి, విస్తృతంగా ఏర్పడ్డాయి (పేజీ 163-64). 14వ శతాబ్దం చివరినాటికి గ్రామసభలు పూర్తిగాక్షీణించాయని సత్యనారాయణగారి అంచనా (పేజీ195). గ్రామఅధికార్లు గ్రామసేవకులుకాక ప్రభుత్వ అధికార్లయ్యారు. బ్రాహ్మలకు అగ్రహారాలు, జీతానికిబదులు జాగీర్లు ఇవ్వడంమాత్రమే కాకుండ ఇంకొక రెండురకాల భూస్వాములుగూడ ఏర్పడ్డారు. మొదటిది యూరోపియన్ ఫ్యూడల్ ప్రభువులనుపోలిన సైనికజాగీర్దార్లు. యుద్ధంవచ్చినప్పుడు రాజుకు సైన్యాన్ని సమకూర్చిపెట్టే ఒప్పందంతో 'ఇక్తా'లు అనబడే జాగీర్లుపొందిన వాళ్లు వీళ్ళు. (గతంలో సామంతులు ఈ కర్తవ్యం నిర్వహించేవారు) ఆ జాగీర్లనుండి పన్నువసూలుచేసి దానితో సైన్యాన్నిపోషిస్తారు. పన్నువసూలేకాక, భూమిని సాపు

చేయించుకొని స్వంతంచేసుకోవడం, లేదా గ్రామభూములను ఆక్రమించుకొని రైతులతో వెట్టి, కౌలు, చేయించుకోవడంగూడకద్దు. రెండవది పన్నుగుత్తదార్లు, ఒక ప్రాంతం నుండి పన్నువసూలుచేసి ప్రభుత్వానికిచ్చే హక్కును గుత్తకుతీసుకున్న వాళ్ళు వీళ్ళు. వీళ్ళకే అభూమిపై యాజమాన్యం గూడ ఇచ్చి ఈ పద్ధతిని మరింత పటిష్ఠం చేసింది తరువాతి కాలంలో బ్రిటిష్ జమీందారీ వ్యవస్థ.

ఈ మార్పులు చాలావరకు ముస్లింలు వచ్చిన తరువాత ఏర్పడ్డవన్నది కేవలం కాకతాళీయమే. ఫ్యూడలిజం ముదిరేకొద్దీ ఆదిమసమాజపు అవశేషమయిన గ్రామసభలు నశించడం, పలురకాల భూస్వాములు పుట్టుకురావడం అనివార్యం. అయితే ముస్లింలు మనదేశానికి తీసుకవచ్చిన మార్పుగూడ ఒకటుంది.

అరబ్బులది వ్యాపారనాగరికత. ఎడారిమయమయిన వాళ్దేశంలో వ్యవసాయిత సమాజంపుట్టే అవకాశం లేదు. పశ్చిమానకొని తూర్పున అమ్ముతూ, తూర్పున కొని పశ్చిమాన అమ్ముతూ, ఈ దళారీ వ్యాపారంలో తమజీవనాన్ని సంపాదించుకున్న సంచారితెగలు ఆనాటి అరబ్బులు. ఇస్లాం వాళ్ళమతం. ఈ మారకవ్యాపారానికి అనుబంధంగా పట్టణప్రాంతాలలో వృత్తిపనుల పరిశ్రమలు బాగా అభివృద్ధిచెందాయి. గృహనిర్మాణంలో, బట్టలనేతలో, పట్టుపురుగుల పెంపకంలో, తాము కొంత సాంకేతిక అభివృద్ధిని సాధించారు. కొంత తరువాతికాలంలో చైనానుండి నేర్చుకున్నారు. మనదేశానికి అరబ్బులు, ఇతరముస్లింలు (ముఖ్యంగా పర్షియన్లు), రావడంతో ఈ వృత్తిపరిశ్రమల నాగరికత దిగుమతిఅయి, అప్పటికే ఇక్కడ కొంతఅభివృద్ధిచెంది వుండిన పారిశ్రామిక- వ్యాపారరంగం మరింతబలపడి, స్వయంపమృద్ధ గ్రామీణ వ్యవస్థకు ఒక పారిశ్రామికకవచం తొడగబడింది. ముస్లింలరాకకుఉన్న ఈ సామాజిక ప్రభావం కారణంగానే మనదేశంలో దిగువకులాలనుండి ముస్లింమతం పుచ్చుకున్న వాళ్ళలో వృత్తిపనివారేఎక్కువ, రైతులుతక్కువ. అందులోనూ వస్త్రపరిశ్రమకు సంబంధించిన కులాలవాళ్ళే ఎక్కువ. ఈ ప్రభావానికి సంబంధించిన వివరాలను, దానివల్ల మనదేశ ఫ్యూడల్‌వ్యవస్థలో వచ్చినమార్పులను, అన్వేషిస్తూ గత పదిసంవత్సరాలుగా అలీఘడ్ విశ్వవిద్యాలయ చరిత్రశాఖవారు (ఇర్ఫాన్ హబీబ్, ఇక్తిదర్ అలంఖాన్, తదితరులు) చాలా పరిశోధనలు జరిపారు. ఈ పవిత్ర భారతదేశానికి వస్త్రపరిశ్రమలో సాంకేతిక అభివృద్ధి ముస్లింలుతెచ్చారని అభిప్రాయపడ్డ పాపానికి బ్రాహ్మణ చరిత్రకారులచేత తిట్లుగూడతిన్నారు. ఆ పరిశోధన లేవీ సత్యనారాయణగారి దృష్టికి వచ్చినట్లులేవు. అయితే ఈ దశలో వచ్చిన వ్యాపార,

పారిశ్రామిక, విస్తరణగురించి మాత్రం వివరంగానే చెప్పారు. విజయనగర రాజ్యంలో, వృత్తిపనివాళ్ళ నుండి, వర్తకులనుండి, వసూలయినపన్ను మొత్తం పన్నులో సగంవుండేదని అంచనావేసారు, దీనిగురించి నాకొక అనుమానం వుంది. నిలవఉండే పంటలు పండించే భూమిమీద పన్ను వస్తురూపంలో వసూలుచేసేవారు కాబట్టి అది రొక్కపుపన్నులో చేరదు. అటువంటప్పుడు రొక్కపుపన్నులో వృత్తి పనివారు, వర్తకులూ, ఇచ్చుకున్నది సహజంగానే ఎక్కువ ఉంటుంది- పారిశ్రామిక వాణిజ్యవిస్తరణతో సంబంధం లేకుండ. ప్రతి గ్రామంలోను సంతలు జరిగేవని 'అముక్తమాల్యద' అంటున్నదనీ, దాన్నిబట్టిగూడ వ్యాపారం విస్తరించినట్లూ స్వయం సంపూర్ణ గ్రామవ్యవస్థ బలహీనపడ్డట్లూ తెలుస్తుందని రచయిత అన్నారు (పేజీ 220). ఇది వాస్తవమే అయితే చాలా ఆసక్తి కరమయిన విషయం. అంతకుముందు సంతలు జరిగేవికావా? సంతలలో అమ్మకంజరిగేవి స్వయంపోషక గ్రామాలలో ఖర్చుకాగా మిగిలిన సరుకులుకావా? సంతలలో అమ్మకంకోసమే ప్రధానంగా ఉత్పత్తిచేయడం కొంతమేరకయినా సరే విజయనగరకాలంలో మొదలయిందా? రాజవంశాల అర్థరహిత మయిన చరిత్ర గురించి అంతంతసమాచారం సేకరించడానికి వెచ్చించిన శ్రమలో సగం ఇలాంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి ఉపయోగించి ఉంటే బాగుండేది.

ఈకాలంలో వృత్తిపనివాళ్ళ శ్రేణులూ (craft guilds) వర్తకశ్రేణులూ (traders guilds) బలపడ్డాయి. వృత్తిపనివాళ్ళ శ్రేణులు వర్తక శ్రేణులకులోబడి ఉండేవని రచయిత అభిప్రాయం (పేజీ 222). ఈ వర్తకశ్రేణులు పట్టణప్రాంతా లలో పన్నువసూలును గుత్తకుతీసుకోవడంగూడ జరిగేది. అంటే గ్రామాలలోని జమీందార్లవంటి రెవెన్యూ గుత్తదార్లకు వీళ్ళు పట్టణరూపమన్నమాట. రాజ్యంనలు మూలలకూ ఆహారధాన్యాలు, సుగంధద్రవ్యాలు, వస్త్రాలు, రవాణాకావడమేకాకుండ, విదేశీవ్యాపారంగూడ బాగా జరిగేదికాబట్టి ఈ రెవెన్యూ గుత్తదార్లకు కావలసినంత గిరాకీ. నిజానికి- వ్యాపారం ఉన్నా లేకున్నా- ఫ్యూడల్ ప్రభుత్వాలకు పన్నువసూలును మించిన వ్యాపకం మరొకటిలేదు. పారిశ్రామికఉత్పత్తి, మారకం, ఎక్కువగా వుండవుకాబట్టి ఇవాళ్టిలాగ excise మీద, sales tax మీద ప్రభుత్వాలునడవ్వు, పాలక వర్గాల వినోదాలూ విలాసాలూసాగవు. రకరకాలపన్నులు- మనకు అమానుషంగాను హాస్యాస్పదంగాను కనిపించేవి- సేకరించాలి, విజయనగరరాజులు ఏటా తమక్షత్రియ ధర్మ నిర్వహణార్థం నడిపేయుద్ధాలకోసం పదివేలగుర్రాలు దిగుమతిచేసుకునేవారట. ప్రజలను ఎంతగా, ఎన్నెన్నిరకాలుగా, దోచుకుంటే ఈవిలాసాలుసాధ్యం? అందుకే

పెళ్ళికిపన్ను, పిల్లలుపుడితేపన్ను, గుళ్ళోమొక్కుతుంటేపన్ను, గుండుగీక్కుంటేపన్ను, ప్రభుత్వానికి అర్జీపెట్టుకుంటేపన్ను, అన్నిటికీపన్నే. మరి రవాణా సౌకర్యాలు, ప్రసారసౌకర్యాలు, అపరిణతంగావున్న ఆరోజుల్లో పాలకవర్గాలకు జీవధాతువయిన ఈపన్నుల సేకరణకూడ పెద్దసమస్యే. ఇంగ్లండు, జర్మనీవంటి చిన్న దేశాలలో ఏమోగాని, మనబోటివిశాలమయినదేశాలలో ఆ సమస్య చాలాజటిలమయినది. ఈకారణంగానే, యూరప్ భూస్వామ్యంలోని సైనిక జాగీర్దార్లకంటే మనదేశ భూస్వామ్య సమాజంలో రెవెన్యూగుత్తదార్లకు ప్రాధాన్యతఎక్కువ.

దాదాపు సంపూర్ణంగా అభివృద్ధి చెందిన ఫ్యూడలిజం, సాంకేతికంగా కొంత అభివృద్ధిచెందిన వృత్తిపరిశ్రమలూ, దానితోటి వ్యాపారవిస్తరణ– ఇవీ విజయనగరానికీ గజపతులకూ బహమనీలకూ పునాది. పునాదిలో ఈపాటి అభ్యుదయం ఉండడం వల్లేకాబోలు ఆకాలంలో అనువాద సాహిత్యం కాకుండ స్వతంత్ర సాహిత్యం వచ్చింది. అది ఫ్యూడల్ సాహిత్యమే, కాని పూర్తిగా దిగజారిన సాహిత్యం కాదు. ఆపాటి అభ్యుదయాన్ని కూడ కోల్పోయిన తరువాతే ప్రబంధ సాహిత్యం చాటుసాహిత్యమో అంతఃపుర సాహిత్యమో అయింది.

వీళ్లతరువాత వచ్చిన గోల్కొండ కుతుబ్‌షాహీల పాలనలో, పైనపేర్కొన్న వృత్తిపరిశ్రమల విస్తరణా, వ్యాపారవిస్తరణా కొనసాగాయి. ముఖ్యంగా, డచ్, బ్రిటిష్, ఈస్ట్‌ఇండియా కంపెనీలు ఏర్పడ్డతరువాత యూరప్‌కు వస్త్రాల ఎగుమతి విరివిగాసాగింది. ఈ విదేశీవ్యాపారంలో భారతదేశానిదే పైచేయి. వాణిజ్యసమతూకం (balance of trade) భారతదేశానికే అనుకూలంగా ఉండడంచేత విదేశాలనుండి బంగారం దిగుమతి అయ్యేది. తమదేశాలనుండి బంగారమంతా ఇండియాకు వెళ్ళిపోతోందనీ, కాబట్టి ఇండియాతో వ్యాపార సంబంధాలు తెంచుకోవాలనీ, ఫ్రాన్సువంటి పాశ్చాత్యదేశాల మేధావులు తమ ప్రభుత్వాలకు సలహా ఇచ్చినట్టు క్లాడ్ అల్వారెస్ అంటారు. ఈ వ్యాపారంలో భాగంగా మచిలీపట్నం, నర్సాపురం రేవులుగాను, నౌకా నిర్మాణకేంద్రాలుగాను ప్రసిద్ధి చెందాయి.

'ఇవన్నీ చూస్తే, కుతుబ్‌షాహీలకాలంలో గ్రామ స్వయంపూర్ణత్వం శిథిలమవుతూ అమ్మకానికై సరుకులతయారీ పెద్దఎత్తున ప్రారంభమయిందని.... అర్థమవుతుంది' అని రచయిత అభిప్రాయం (పేజీ 298), గ్రామీణ స్వయం సంపూర్ణతను దేశీయవ్యాపారమే తప్ప విదేశీవ్యాపారం దెబ్బతీయలేదు కాబట్టి ఇందులో కొంత అతిశయోక్తి ఉందిగాని, ఈ పారిశ్రామిక, వ్యాపార, విస్తరణవల్ల శూద్రకులాలకు

ముఖ్యంగా వస్త్రఉత్పత్తిదార్లకు- సమాజంలో స్థానంపెరిగింది. ఆర్థికంగా కొంత బలపడి వాళ్లు వర్ణవ్యవస్థలో తమకున్న అధోస్థానాన్ని నిరసించారు. సాహిత్యంలో ఆ నిరసనను వ్యక్తపరిచిన వాడు వేమన.

అటుతరువాత బ్రిటిష్‌వాళ్ళకు భారతదేశం వలసగామారడం, వాళ్ళతమ రెవెన్యూ అవసరాలకోసం భూమిసంబంధాలలో కొన్నిమార్పులు తీసుకరావడం, ఇదంతా తరువాతికాలంకథ. ఆ కథను పుస్తకం మూడవభాగంలోచెప్తారు కాబోలు సత్యనారాయణగారు. ఫ్యూడల్ కాలంలాగాకాకుండ వలసకాలాన్ని గురించి విస్తృతమయిన పరిశోధనలు జరిగాయి. వాటిని దృష్టిలోవుంచుకుని మూడవభాగాన్నయినా శాస్త్రీయంగారాస్తే తెలుగువాళ్లకు ఎనలేనిసేవచేసిన వారవుతారు.

చివరిగా రెండుమాటలుచెప్పాలి. వ్యాఖ్యానించే ప్రయత్నం లేకపోవడం ఒక లోపమయితే, భారతదేశఫ్యూడలిజానికి ప్రత్యేకమయిన లక్షణాలను పట్టించుకోకపోవడంపుస్తకంలో మరొకలోపం. మొదటిభాగాన్ని సమీక్షించిన ఒక విమర్శకుడు కులవ్యవస్థను పట్టించుకోనందుకు సత్యనారాయణగారిని తప్పుపట్టడం జరిగింది. ఆ విమర్శ రెండవభాగానికి మరింత బాగావర్తిస్తుంది. ఎందుకంటే ఈ కాలంలో కుల వ్యవస్థ బాగామునిరి ఉత్పత్తిసంబంధాలలో భాగంగా తయారయింది. నిజానికి స్వయం సంపూర్ణగ్రామాలలో వ్యవసాయేతరఉత్పత్తిలో కులవ్యవస్థ ఉత్పత్తిసంబంధాల పాత్ర నిర్వహించింది. వ్యావసాయిక ఉత్పత్తి సంబంధాలలోగూడ దానిపాత్ర తక్కువేంకాదు, భారతదేశ ఫ్యూడలిజంలో కులం ఒక ఉత్పత్తి సంబంధం అనడానికి చాలామంది మార్క్సిస్టులు సాహసించడంలేదుగాని అది కాదనలేనివాస్తవం.

భక్తిఉద్యమాల గురించి గూడ చాలా గందరగోళంవుంది. ఆ చిక్కువిడదీయడం అంత సులభంకాదుగాని, రెండు విషయాలు చెప్పకతప్పదు. భక్తిఉద్యమాలను కేవలం ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా సామాన్యప్రజల నిరసనను వ్యక్తపరిచిన ఉద్యమాలుగా అర్థంచేసుకోవడం తప్పు. ఆ అంశం వాటిలో లేకపోలేదుగాని అదే వాటి ప్రధానస్వభావంకాదు. భూస్వామ్య సమాజానికి భక్తి చాలాముఖ్యం పెట్టుబడిదారీ దోపిడీకి ఆర్థిక ప్రగతిని సాధించగలదనే లౌకిక సమర్థనవుంది. అది సాధించగల ప్రగతి పాక్షికం, సంక్షోభమయం అన్నది వేరేవిషయం. ఆ విషయాలు లోతుగా వెళ్తేగాని అర్థంకావు. కాని భూస్వామ్య దోపిడీకి అపాటి లౌకికసమర్థనగూడ సాధ్యంకాదు. దోచుకోబడే శ్రామికుడు దోచుకునే వాడిపట్ల 'నీ బాంచన్' అనే గుడ్డిభక్తిని ప్రదర్శించకపోతే భూస్వామ్య దోపిడీ నడవదు. అందుకే, దేనినీ ప్రశ్నించని

భక్తితత్వం భూస్వామ్య సమాజానికి అనువయిన భావజాలం. అయితే మనదేశంలో ఫ్యూడలిజం ఒక్కనాడు ఏర్పడక దశలుదశలుగా, అంచెలంచెలుగా, ఏర్పడింది కాబట్టి ఈ భక్తితత్వంగూడ ఒక్కనాడు మొలవకుండ 10 వ శతాబ్దం నుండి 14-15 శతాబ్దాల వరకు భక్తి ఉద్యమాల పరంపర రూపంలో సమాజాన్ని ఆవరించింది. ముదురుతున్న ఫ్యూడలిజానికి సమాంతరంగా ముదురుతున్న భక్తిభావంగానే వాటిని అర్థంచేసుకోవాలి. అంతేగాని 'ఫ్యూడలిజం' అన్నది మార్పులేని వ్యవస్థగాను అందులోవచ్చే ఉద్యమాలన్నీ ఫ్యూడల్ పీడననుండి ప్రజలకు ఉపశమనం ఇచ్చేవిగాను అర్థం చేసుకోవడం చాలా మొరటు వ్యాఖ్యానం. అదే వాస్తవమయితే కాకతీయులు శైవాన్నీ, విజయనగర ప్రభువులు వైష్ణవాన్నీ, కళింగగజపతులు చైతన్యాదితత్వాన్నీ ఎందుకు ఆదరించారో, భక్తిసిద్ధాంతాలకు వ్యతిరేకమయిన జైనమతాన్ని కాకతీయులెందుకు సాయుధంగా నాశనం చేసారో అర్థంకాదు.

మరయితే ఆనాటి భక్తిఉద్యమాలలో కొన్ని 'ప్రజాస్వామిక' లక్షణాలు లేవా అంటే ఉన్నాయి. దానికి రెండు కారణాలుగూడ ఉన్నాయి. ఒకటి, ఫ్యూడలిజం ముదరడం అంటే చిల్లర భూస్వాములు ఏర్పడడం. ఇట్లాఏర్పడ్డ చిల్లరభూస్వాములలో బ్రాహ్మణ మతంచేత శూద్రులుగా పరిగణించబడ్డవారు (నేటి రెడ్లు, వెలమలు, మొద లయినవారు) ఉండడంచేత, ఈ ఉద్యమాలకు వర్ణవ్యవస్థపట్ల వ్యతిరేకత ఉండడం సహజం. రెండవది, సమాజంలో వచ్చే ఏనూతనమార్పయినా తన కర్తవ్యాన్ని మించిన ఆదర్శాలను చరిత్రలోకి తెస్తుంది. బుద్ధుడినుండి ఫ్రెంచి బూర్జువా విప్లవ తాత్వికులవరకు తమ పరిధిలోలేని సర్వమానవ సమానత గురించి, సౌభ్రాతృత్వాన్ని గురించి విజాయితీతో మాట్లాడినవారే.

అనువాదం సరళంగానేవుంది, కొన్ని మినహాయింపులతో. 'పరిశ్రమలతో, ప్రత్యక్షంతో' అనేబదులు 'పరిశ్రమలూ, వర్తకమూతో' అనకతప్పదా, నవలా రచనలో-చేయితిరిగిన మహీధర రామమోహనరావుగారికి? సంక్షిప్తీకరణ గురించి ఆంగ్ల మూలం చూస్తేగాని చెప్పలేం.

— కె. బాలగోపాల్

ఆంధ్రుల సంస్కృతి, చరిత్ర - II. కంభంపాటి సత్యనారాయణ, సంక్షిప్తానువాదం : మహీధర రామమోహనరావు, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణ (మార్చ 1982), పేజీలు: 354 + xxiv, 1/8 డెమీ, వెల రు. 14-00 ప్రతులకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 3-6-694, హిమాయత్‌నగర్, హైదరాబాద్ 500 029